జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 31-12-2024 | ఎడిటర్: చౌదరి ప్రమోద్ కుమార్ | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 205 పేజీలు: 4 వెల : రూ.7



* కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం * మొదటిరోజు 322 మంది హాజరు * అన్ని ఈవెంట్లను దగ్గరుండి పర్యవేక్షించిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి * పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ * అభ్యర్థులను వెన్నుతట్టి.. ప్రోత్సహించిన ఎస్పీ * ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు

పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్ని చర్యలు తీసుకున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన నుంచి దేహదారుఢ్య పరీక్షలు, ఈవెంట్లు జరిగే వరకూ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అభ్యర్థులను వెన్నుతట్టి ఉత్సాహపరుస్తున్నారు. పారదర్శకంగా ఎంపిక ఉంటుందని చెబుతూ వారికి భరోసా కల్పిస్తున్నారు. స్వయంగా ఎస్పీయే పర్యవేక్షిస్తుండడంతో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్న అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# అంతా తానై..!

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 30 (వార్త):** పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంటు (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియన్సీ (పీఈటీ) పరీక్షలు నిర్వహిస్తున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన, బయోమెట్రిక్ అథంటికేషన్ తీసుకుంటున్నారు. అలాగే ఫిజికల్ మెజర్‌మెంట్‌కు సంబంధించి ఛాతీ, ఎత్తు కొలతలు నిర్వహించారు. ఫిజికల్ ఎఫిషియన్సీలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ నిర్వహించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి అంశాన్ని సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు. నీరు, వైద్య శిబిరాన్ని అందుబాటులో ఉంచారు. ఎక్కడ ఎలాంటి లోపాలు లేకుండా, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేసుకుని, ఈవెంట్‌లో ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించాలని అభ్యర్థులకు ఎస్పీ సూచించారు. మొదటి రోజు 600 మంది అభ్యర్థులకు గాను 322మంది హాజరయ్యారు. వీరిలో 192 మంది ఎంపికయ్యారు.









## ఎచ్చెర్ల ఎంపీడీవోకు

# ఎంపీపీ బెదిరింపు

* కలెక్టర్ ఆదేశాలతో పోలీసులకు జడ్పీ సీఈవో ఫిర్యాదు * ఎచ్చెర్ల స్టేషన్‌లో కేసు నమోదు * ఎంపీడీవోను పరామర్శించిన విజయనగరం ఎంపీ, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 30 (వార్త):** ఎంపీడీవోను బెదిరించిన ఎంపీపీపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఉపాధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఇటీవల నిర్వహించిన సమీక్షలో నియోజకవర్గ ఎంపీడీవోలను ఆదేశించారు. అయితే ఈ విషయమై ఎచ్చెర్ల ఎంపిపీ మొదలవలస చిరంజీవి ఎంపీడీవో సీపాన హరిహరరావును తనవద్దకు పిలిపించుకున్నాడు. ఎమ్మెల్యే పంపిన లేఖలకు మంజూరైన పనులకు గాను ప్రతిపాదనలు పంపొద్దని.. పంపితే తీవ్ర పరిణామాలను చూడాల్సివస్తుందని హెచ్చరించాడు. దీంతో భయాందోళనకు గురై ఎచ్చెర్ల ఆసుపత్రిలో ఎంపీడీవో చేరారు. ఈ విషయం ఇటు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరంఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలుసుకుని ఎంపీడీవోకు భరోసా ఇచ్చారు. స్వేచ్ఛగా పనిచేసుకోవాలని, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గవద్దని సూచించారు. ఎంపీడీవోను ఎంపీపీ బెదిరించిన విషయం కలెక్టర్‌కు చేరడంతో విచారణకు ఆదేశించారు. జడ్పీ సీఈవో శ్రీధర్‌బాబు విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ఎంపీడీవోను బెదిరించిన ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవిపై కలెక్టర్ ఆదేశాలతో జడ్పీ సీఈవో ఎచ్చెర్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీపీపై బీఎన్ఎస్ 132, 351(2) కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్‌కుమార్ స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎంపీపీ మొదలవలస చిరంజీవి అధికారులపై బెదిరింపులకు పాల్పడ్డారన్న విమర్శలు సర్వత్రా వినిపించాయి. వైసీపీకి చెందిన వ్యక్తిపై హత్యాయత్నం కూడా చేసినట్టు కేసు కూడా నమోదైంది.

## సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా..

# రథసప్తమి వేడుకలు నిర్వహిద్దాం

*మూడు రోజులు పాటు శోభాయాత్ర * ప్రధాన కూడళ్లలో బ్యూటిఫికేషన్ * ఎక్కడికక్కడ లేజర్ షో * జిల్లా ప్రతిష్టను పెంచేలా వేడుకలు * అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ *ఎమ్మెల్యే గొండు శంకర్, అధికారులతో కలిసి సమీక్ష




**శ్రీకాకుళం, డిసెంబర్ 30 (వార్త):** రాష్ట్ర పండుగగా ప్రకటించిన అరసవల్లి రథసప్తమి వేడుకలను జిల్లా సంస్కృతీ, సాంప్రదాయాలు ఉట్టి పడేలా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలు శోభాయాత్రతో ప్రారంభమై, సాంప్రదాయ క్రీడలు, లేజర్ షో, బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేయనున్నాయని, లక్షలాది భక్తులను ఆకర్షించే ఈ వేడుకల కోసం శ్రీకాకుళం నగరాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలని నిర్ణయించారు. ప్రధాన కూడళ్లలో బ్యూటిఫికేషన్ కార్యక్రమాలు చేపట్టాలని, ఫౌంటెన్లు నిర్మించాలని సూచించారు. రథసప్తమి వేడుకలు జిల్లా ప్రతిష్టను పెంచుతాయని, ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పరిశుభ్రత, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. సంప్రదాయ కళలు, క్రీడలను ప్రోత్సహించేలా కార్యక్రమాల నిర్వహణ ఉండాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఓ వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణ మూర్తి, శ్రీకాకుళం డీఎస్పీ సిహెచ్ వివేకానంద, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, అరసవెల్లి ఈవో వై భద్రాజీ, డి ఎస్ డి ఓ శ్రీధర్, పర్యాటకశాఖ అధికారి ఎన్ నారాయణరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పరిశ్రమల స్థాపనపై అవగాహన

**శ్రీకాకుళం, డిసెంబరు 30(వార్త):** పరిశ్రమల స్థాపనపై అవగాహన అవసరమని జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం పి.వి రంగనాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మాసమే ఎంఎస్ఎమ్ఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆర్ఏఎంపి పథకం క్రింది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంటర్ప్రెన్యూర్షిప్ మరియు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ (ఈఎస్డిపి) యొక్క వర్క్ షాప్ లను శ్రీకాకుళం జిల్లాలో మూడు ప్రదేశాల్లో అనగా శ్రీకాకుళం, ఎచ్చెర్ల మరియు పలాసలో త్వరలో నిర్వహించబడును. ఈ కోర్సులు నెల రోజుల పాటు పరిశ్రమల స్థాపనలో అవసరమైన వివిధ అంశాలపై అవగాహన కల్పించబడును, శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్స్ ఇవ్వబడును. ఈ ప్రోగ్రాం లో పాల్గొనే ఔత్సాహికులు ముందుగా జనరల్ మేనేజర్ జిల్లా పరిశ్రమల కేంద్రంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

# అన్నదాతను ఆదుకోవాలి



**మందస, డిసెంబర్ 30(వార్త):** ఖరీఫ్ సీజన్లో అన్ని విధాలా నష్టపోయిన అన్నదాతను ఆదుకోవాలని మహేంద్ర, చైతన్య రైతు సంఘాల నాయకులు కోరారు. మందస తహసీల్దార్ ఎస్.హైమావతికి వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రైతులకు పంట నష్టం జరిగిందన్నారు. ఒక ఎకరానికి ఖర్చులు 20మంది కూలీలు సరిపోతారు కానీ ఈ ఏడాది రెండింతలు ఖర్చు అయ్యిందన్నారు. ప్రకృతి విపత్తుగా పరిగణలోకి తీసుకోని రైతుల పంట నష్టము క్రింద ఎకరానికి రూ.20 వేలు నష్ట పరిహారం ఇప్పించి, రైతన్నలను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం, ప్రకృతి ఏదీ కూడా రైతులకు సహకరించనందున రైతులు అప్పులు బాధల్లో కూరుకు పోతున్నారని, కునికే నక్కపై తాటిపండు పడినట్లు రైస్ మిల్లర్లు రైతుల పంటను దోపిడీ చేస్తున్నారని, ధాన్యము ధర 80కిలోలకు 1840 రూపాయలు కాగా మిల్లర్లు రైతులు వద్ద కళాసి మామూలు పేరుతో ఒక ట్రాక్టర్ లోడు 50 బస్తాలకు 1265 రూపాయలు పైగా దోచుకుంటున్నారన్నారు. ఈ విషయమై దృష్టి సారించాలన్నారు. హమాలీల ఖర్చు నిమిత్తం రైతులు వద్ద ఒక బస్తాకి 20రూపాయలు చొప్పున రైతులు వద్ద వసూలు చేస్తున్నారని, ట్రాక్టర్ మామూలు క్రింద రైతులు వద్ద నుండి 150 రూపాయలు వసులు చేస్తున్నారన్నారు. తేమ శాతము గుర్తింపు విషయంలో ఆర్బీకే అధికారులు ఇచ్చి 17%లోపల వున్నప్పటికీ పరిగణలోకి తీసుకోకుండా వాళ్ళ సొంత మిషను ద్వారా 24%పైబడి చూపిస్తూ, ఒక పాయింటుకు ఒక కిలో చొప్పున ఎన్నిపోయింట్లు ఉంటే అన్నికేజీలు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కిలోనుండి 10కిలోల ధాన్యము తీసుకుంటున్నారన్నారు. తుఫానుతో నష్టపోయిన రైతులకు సహయ, సహకారాలు అందించాలని కోరారు. పెసర, మినుము పంటలు నాశనము అయ్యాయని, ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలన్నారు. పంట నష్టపరిహారం ఇప్పించాలని, వరిచేలు కుళ్ళినందున పశుగ్రాసం కొరత ఏర్పడుతుందని, పశుగ్రాసం ఉచితంగా ఇప్పించాలని, పలాస డివిజన్ లో నీటి వనరులు పుష్కలంగా ఉన్నా రైతులు పంటకు సాగు నీరు అందక సకాలములో పంటలు పండించ లేకపోతున్నారని, సాగునీరు అందించాలన్నారు. రైతులు పండించిన ప్రతీ పంటకి ఇతర రాష్ట్రాలు మాదిరిగా గిట్టుబాటు ధర కల్పించాలని, యువకులకు వ్యవసాయం పై దృష్టి సారించేలా చేసి, ప్రభుత్వము ప్రోత్సాహకాలు ఇప్పించాలని, రైతు సంక్షేమ పింఛను పథకాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వము రైతు భరోసా ఒక ఎకరానికి రూ.10వేలు చొప్పున ఇవ్వాలని, పంటలు భీమా పథకాన్ని గ్రామం యూనిట్ గా తీసుకోని అమలు చేయాలన్నారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని, ప్రతి ఏటా ధాన్యము సీజనులో కళాసీలకు, యాజమాన్యాలకు తగవులు సృష్టించు చున్నారని, వారి న్యాయమైన కోర్కెలు తీర్చవలసిన భాద్యత యాజమాన్యంపై ఉందన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యం మంచిది కాదని భావిస్తున్నామన్నారు. వీలయినంత త్వరగా రైస్ మిల్లర్స్ యాజమాన్యానికి, రైతుసంఘాలకు, కళాసి సంఘాలకు ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహేంద్రా, చైతన్య రైతుసంఘాల అధ్యక్షులు బెస్త కామేశ్వరరావు, మామిడి మాధవరావు, నల్ల హడ్డి, కొర్ల పాపారావు, ఉప్పాడ రాజారావు, యవ్వారి రాజారావు, వాయిలపెల్లి రమణ, కొర్ల హేమారావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ 18వ బ్యాచ్ డ్రైవర్లకు సర్టిఫికెట్లు



**శ్రీకాకుళం, డిసెంబరు 30(వార్త):** ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ శ్రీకాకుళం నందు శిక్షణ పూర్తి చేసుకున్న 18వ బ్యాచ్ డ్రైవర్లకు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీ ఏ. విజయకుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరు కూడా భవిష్యత్తులో మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలని, ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణ తీసుకున్నందుకు వారందరికీ కూడా శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ వారంలో 19వ బ్యాచ్ మొదలవుతుందని,లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం అనుభవం కలిగిన వారందరూ కూడా దరఖాస్తు చేసుకోవచ్చని 40 రోజులు శిక్షణ తోపాటు మెకానికల్ వర్క్, యోగ, వ్యక్తిత్వ వికాసం, ట్రాఫిక్, రోడ్డు ట్రాఫిక్ రూల్స్ మొదలగు అన్నింటి మీద కూడా శిక్షణ ఇవ్వబడుతుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు కూడా సద్వినియోగం చేసుకోవాలని, తదుపరి బ్యాచ్, ఫీజు ఇతర వివరాల కోసం 807464079273829 23293 నెంబర్లను సంప్రదించవలసినదిగా కోరినారు

## సారా తయారీ కేంద్రాలపై దాడులు



**మందస, డిసెంబర్ 30(వార్త):** మందస మండలంలోని కొండలోగాం పంచాయతీ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. సీఐ కె.బేబి ఆధ్వర్యంలో కొండలోగాం ప్రాంతంలో 700లీటర్ల పులిసిన బెల్లం ఊటలను గుర్తించి, ధ్వంసం చేశారు. నాటుసారా తయారీకి వినియోగించే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. బూరగాం వద్ద 40లీటర్ల నాటుసారాతో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, ద్విచక్రవాహనం సీజ్ చేశామని సీఐ బేబి తెలిపారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

## వేడుకలకు ఒంటిగంట వరకే అనుమతి



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 30(వార్త):** నూతన సంవత్సర వేడుకలకు మంగళ వారం అర్ధరాత్రి ఒంటి గంట వరకే అనుమతి ఉంటుందని సీఐ ఎం.చిన్నం నాయుడు చెప్పారు. ఒంటి గంట తర్వాత రోడ్లపై సంచరించకూడదన్నారు. డిజెలకు అనుమతి లేదన్నారు. ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజా జీవనానికి విఘాతం కలగకుండా శాంతియుతంగా వేడుకలు నిర్వహించు కోవాలన్నారు.

## సంపూర్ణ వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం



**పోలాకి డిసెంబర్ 30(వార్త):** సంపూర్ణ వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం కత్తిరివానిపేటలోని తన కార్యాలయం లో ఆయన ముఖ్య మంత్రి సహాయనిధి నుంచి నరసన్నపేట పప్పుల వీధికి చెందిన వసంత కుమారికి మంజూరైన రూ.86,936 చెక్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ అత్యుత్తమ వైద్యం అందజేసేందుకు సీఎంఆర్ఎఫ్ కింద వచ్చిన చెక్కులను అందజేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు బలగ ప్రహర్ష మాజీ ఎంపీటీసీ కింజరాపు చిన్నవాడు వార్డు సభ్యులు బతకల సంతోషి గోపి భూలక్ష్మి పాల్గొన్నారు.

## ఉద్యమ నాయకుడు మట్ట శ్రీరాములు మృతి



**మందస, డిసెంబర్ 30(వార్త):** బహడపల్లి మరో ఉద్యమ నాయకుడిని కోల్పోయింది. ఆ గ్రామానికి చెందిన మట్ట శ్రీరాములు మరణించారు. పీపుల్స్ వార్ ప్రాబల్యం గల ఈ ప్రాంతంలో శ్రీరాములు ఎన్నో పోలీసు కేసులను ఎదుర్కొన్నారు. వాటన్నింటిని తట్టుకుంటునే ప్రజా సంఘాలలో పని చేస్తూ.. శ్రీరాములు ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు జరిపారు. అనంతరం ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొన్నారు. ఆయన భార్య మట్ట సాయమ్మ ఎంపీటీసీగా పని చేశారు. అనారోగ్యంతో చివరి రోజుల్లో ఆయన చురుకుగా పాల్గొనలేకపోయారు. భార్య సాయమ్మ, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీరాములు మరణంతో బహడపల్లిలో మరో ఉద్యమకారుడిని కోల్పోయిందని ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. కాగా, శ్రీరాములు కుటుంబాన్ని పలువురు ఓదార్చి, సంతాపం తెలిపారు.

# విజేతలకు అభినందన



**శ్రీకాకుళం, డిసెంబరు 30(వార్త):** ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) శ్రీకాకుళం నందు జాతీయ వినియోగదారుల దినోత్సవం" సందర్భంగా వారోత్సవాలను నిర్వహించారు. దీనిలో భాగంగా కళాశాలలోని కామర్స్ విభాగం వారు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీలో జిల్లా స్థాయిలో పి. పవిత్ర ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని (బికాం ఫైనల్ ఇయర్ స్టూడెంట్) ప్రథమరాలిగా నిలిచింది . తరువాత జిల్లా స్థాయిలో ప్రథములుగా వచ్చిన 23 జిల్లాల వారికి అందరికీ రాష్ట్ర రాజధాని అమరావతిలో మళ్ళీ వక్తృత్వ పోటీ నిర్వహించడం జరిగింది. అక్కడ కూడా పి.పవిత్ర ప్రథమరాలిగా నిలిచింది. పౌరసరఫరా శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ గారి చేతుల మీదుగా బహుమతిని అందుకున్నది. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ గారు పీ.పవిత్రతను అభినందిస్తూ -23 జిల్లాల వారి తో పోటీ పడి గెలిచి, ప్రథమ రాలిగా వచ్చి, శ్రీకాకుళం జిల్లాకు పేరు తెచ్చావని పవిత్రను ప్రశంసించారు. బహుమతిగాఒక సర్టిఫికెట్, మరియు మెమెంటో, 7000 నగదు బహుమతిని అందజే శారు . ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే .సూర్యచంద్రరావు గారు పవిత్ర నీ ప్రశంసిస్తూ -ఇది తమ కళాశాలకు ఎంతో గర్వకారణమని అభినందిస్తూ, ఇక్కడి తో ఆగకుండా ఇంకా ఉన్నత స్థానాలకు ఎదగాలని మరెన్నో గొప్ప బహుమతులను అందుకొని కళాశాలకు మంచి పేరు తీసుకుని రావాలని పవిత్రను అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల కామర్స్ శాఖదిపతి ఎల్ .కృష్ణారావు,వైస్ ప్రిన్సిపల్ పి . శంకరనారాయణగారు ,అకడ మిక్ కోఆర్డినేటర్ సిహెచ్ .కృష్ణారావుగారు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ ఎస్. పద్మావతి, ఇంకా కళాశాలలోని అధ్యాపకులు అందరూ పవిత్రను ఈ సందర్భంగా అభినందించారు.

## వ్యసనాలకు దూరంగా ఉండాలి



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 30(వార్త):** యువసూర్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ న్యాయవాది రాంబాబు ఆధ్వర్యంలో ఆదిత్య కాలేజ్ విద్యార్థులకు మాదక ద్రవ్యలు మరియు సైబర్ నేరాలుపై అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ వెచ్చ సంతోష్ కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిస కాకూడదు దీనివలన నేర్వాస్ సిస్టమ్ మరియు ఆర్గాన్స్ దెబ్బతిని మానిసిక రోగాలకు గురు అవుతారన్నారు. కార్యక్రమంలో ఆదిత్య కాలేజ్ యాజమాన్యం రాజేంద్ర బాబు, రమణ, శేఖర్, కామేష్ , చిన్నిభైరి, ధర్మరాజు పాల్గున్నారు.

## ఇతిహాసాలు ఆదర్శం

**మందస, డిసెంబర్ 30(వార్త):** ఇతిహాసాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కె.నారాయణ స్కూల్ కరస్పాండెంట్ గుంట రోహిణి శంకర్, డైరక్టర్స్ గుంట బుద్ధసూర్య, అరవింద్ నారాయణన్ అన్నారు. కుంటికోట గ్రామంలో గల కె.నారాయణ స్కూల్ లో తెలుగు భాష-మానవతా విలువలు అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి, ప్రభుత్వ ప్రతిభా అవార్డు విజేత ఎల్.రజితేంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు తెలుగు భాష ద్వారా మానవతా విలువల రూపకల్పన జరుగుతుందన్నారు. విజ్ఞానాన్ని, అనుభవాన్ని జోడించి విద్యార్థుల్లో పెంపొందించుకోవాల్సిన నైతిక, మానవతా విలువలను వివరించారు. విద్యార్థులంతా ఎంతో ఆసక్తిగా కొత్త విషయాలను నేర్చుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



# బ్యాంకు లావాదేవీలపై అప్రమత్తం



**నరసన్నపేట, డిసెంబరు 30(వార్త):** బ్యాంకు లావాదేవీలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ చెల్లింపులపై అవగాహన కలిగి ఉండాలని ఎస్.బీ.ఐ. నరసన్నపేట మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ డి.మధుసూదనరావు తెలిపారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీ, ఆధార్ నెంబర్ల కోసం బ్యాంకు అధికారుల నుంచి ఎలాంటి ఫోన్ కాల్స్ రావనీ గుర్తించాలన్నారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకౌంటింగ్ అండ్ టేక్సేషన్ విద్యనభ్యసిస్తోన్న విద్యార్థులకు ఆన్ ది జాజ్ శిక్షణలో భాగంగా బ్యాంకు లావాదేవీలపై బ్యాంకులోనే ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. వృత్తి విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులకు నెలరోజుల పాటు వివిధ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిజ్ఞానం పొందేలా డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు ఆదేశాలతో ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ సూచనల మేరకు క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో వస్తోన్న మార్పులు, డిజిటల్ బ్యాంకింగ్, వివిధ రకాల దరఖాస్తులు నింపడం, డిపాజిట్, డబ్బులు బట్వాడా చేయడం, నెఫ్ట్, ఆర్టీజీఎస్ ద్వారా నగదు బదిలీ చేయడం వంటి అంశాలపై ప్రాక్టికల్ గా శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సందేహాలను చీఫ్ మేనేజర్ నివృత్తి చేశారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 16 వినతులు

**పలాస, డిసెంబర్30 (వార్త):** ప్రజా సమస్యల పరిష్కారవేదికకు 16 వినతలు వచ్చాయని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేనా రామారావు తెలిపారు. పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజల నుంచి పలు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. పింఛన్లపై 4, మంచినీటి సరఫరాకు 4, పారిశుధ్యంపై 8 వినతులు వచ్చాయని తెలిపారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, సంబంధిత శాఖాధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ అమర్, మున్సిపాలిటీ సిబ్బంది ఉన్నారు.



## రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టండి



**పోలాకి, డిసెంబర్ 30(వార్త):** ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులలో భాగంగా రహదారుల అభివృద్ధిపై చర్యలు చేపట్టాలని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గ రమణమూర్తి అన్నారు. సోమవారం కత్తిరివానిపేటలో గల తన కార్యాలయంలో శాఖా అధికారులతో మాట్లాడారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ పంచాయతీల అభివృద్ధికి నిధులను మంజూరు చేసినట్లు శాసనసభ్యులు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల అభివృద్ధిపై దృష్టి సాధించాలన్నారు. కార్యక్రమంలో డీఈ సత్యనారాయణ ఏఈలు మోహన్ బగ్గు నర్సింగరావు, కె.శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

## ఐఏఎల్ క్యాలెండర్ ఆవిష్కరణ



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 30(వార్త):** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఐ.ఏ.ఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజ్ పాత్రో ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు నందికి రమణయ్య సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐ.ఏ.ఎల్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి సభ్యులకు అందించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్వీఎస్ రంగారావు, కోశాధికారి ఏ. జి పి ఆర్.దేవరాజ్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ఎం.రాంబాబు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేయాలి



**పలాస, డిసెంబర్30 (వార్త):** అంకితభావంతో పారిశుధ్య కార్మికులు పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. పలాస చేపల మార్కెట్ వద్ద పారిశుధ్య కార్మికులు మస్టర్ పాయింట్ ను సీనియర్ పారిశుద్ధ కార్మికులు అమ్మొడమ్మ, గులాబితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఇటీవల మస్టర్ పాయింట్ పరిస్థితిని గమనించి మున్సిపల్ నిధులు సుమారు రూ 2 లక్షలు వ్యయంతో మరమ్మతులు చేపట్టామని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పారిశుధ్యం మెరుగుపరిచేలా కార్మికులు అంతా అంకిత భావంతో పనిచేయాలని కార్మికులకు కోరారు. అనంతరం ఆయన పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికను పరిశీలించారు.

## ఇళ్ల స్థలాలు సిద్ధం చేయండి

**పలాస, డిసెంబర్30 (వార్త):** ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు మంజూరును వేగవంతం చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష రెవెన్యూ అధికారులను కోరారు. సూదికొండ ప్రాంతంలో ఇళ్ల స్థలాల భూములను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నిర్వాసితుడికి ఇంటి స్థలం మంజూరు చేయాలని, నిర్వాసితులకు త్వరలోనే నష్టపరిహారం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మొత్తం ఎంత స్థలాన్ని కేటాయించారు, నిర్వాసితులు ఎంతమంది ఉన్నారని తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్మశానం కోసం కేటాయించిన స్థలాలు ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, జోగ మల్లి, ఎ.రామకృష్ణ, చంద్రశేఖర్ త్యాడి, సర్వేయర్ వి.గిరి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# స్వరాజ్య స్ఫూర్తి కెరటం రాఘవదాస్

**శ్రీకాకుళం, డిసెంబరు 30(వార్త):** భారత స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీజీ పిలుపునందుకొని విద్యార్థి నాయకుడిగా ఉన్న త్రిపురాన రాఘవదాస్ స్వరాజ్య స్ఫూర్తి కెరటంగా జిల్లాలో ఉద్యమాన్ని పరుగులు పెట్టించారని వక్తలు పేర్కొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో జైలు జీవితం గడిపిన రాఘవదాస్ తదనంతర పోరాటంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని ఆచార్య ఎన్.జి. రంగా శిష్యునిగా, దక్షిణాది రాష్ట్రాల స్వాతంత్ర్య సమర యోధుల నాయకునిగా ఎన్నో బాధ్యతలు నిర్వహించారన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు త్రిపురాన రాఘవదాస్ 103వ జయంతి వేడుకలు శ్రీకాకుళం పట్టణంలో గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో సోమవారం ఘనంగా జరిగాయి. రాఘవదాస్ విగ్రహానికి అతని కుమార్తె, మాజీ మంత్రి త్రిపురాన వెంకటరత్నం, కమిటీ పెద్దలు సురంగి మోహన్రావు, నిక్కు అప్పన్న, జామి భీమ శంకర్, నటుకుల మోహన్, నక్క శంకరరావు పాటు తెలగ సంక్షేమ సంఘ అధ్యక్షులు గొంటు వెంకటరమణమూర్తి, ప్రధాన కార్యదర్శి గేదెల నరసింగరావు, సంఘ పెద్దలు వడ్డి శ్యామ్, ఎం. మాధవరావు బృందం పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమిందారీ కుటుంబంలో జన్మించిన రాఘవదాస్ స్వాతంత్ర్య పోరాటంలో జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా గళమెత్తిన త్యాగమూర్తి అన్నారు. సమితి అధ్యక్షునిగా, శాసనమండలి సభ్యులతో పాటు ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల సమితి రాష్ట్ర అధ్యక్షులుగా రాఘవదాస్ పనిచేసి స్వాతంత్ర్యస్ఫూర్తిని నలుదిశలా చాటిచెప్పారన్నారు. పేద ప్రజల పట్ల అపారమైన ప్రేమ కలిగిన రాఘవదాస్ స్ఫూర్తిని ఆయన వారసురాలు వెంకటరత్నం సజీవంగా ఉంచడం గొప్ప విషయమని తెలగ సంక్షేమసంఘ నాయకులు, గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు అన్నారు. ఈ సందర్భంగా తెలగ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి తన తండ్రి పేరు మీద రూ.10 లక్షలు విరాళం అందజేసిన త్రిపురాన వెంకటరత్నంకు సంఘ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిబుల్లాఖాన్, శాస్త్రి, రాజారావు, టూరిజం అధికారి నారాయణరావు, లంక ఆనంద్, దయానందం, మోటూరు భవానీప్రసాద్, కొండా రాంబాబు, గోపిశెట్టి అమర్నాథ్, వై.వి.రమణ, పోలీస్, కె.శేషు, కోలా గజపతిరావు, పుప్పాల రంగబాబు, ఎం.నాగేశ్వరరావు, వై. చిట్టిబాబు, కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## జోగారావు కుటుంబం ఎంతో ఆదర్శం

**మందస, డిసెంబర్ 30(వార్త):** సచివాలయ విద్యుత్ ఉద్యోగి కొంకి జోగారావు కుటుంబం దాతృత్వం ఎందరికో ఆదర్శమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందసలోని జోగారావు కుటుంబాన్ని సోమవారం శిరీష పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొడుకు మరణశయ్యపై ఉన్నాడని తెలిసి, ఎంతో ధైర్యంగా అవయవ దానం చేయడం అభినందనీయమన్నారు. అవయవ దానం ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆమెతో పాటు తెలుగుదేశం పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, మండల ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య, నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ముడుముంచి నవీన్ కుమార్, పట్టణ అధ్యక్షుడు గార కృష్ణారావు, రాజాన మహేష్, కొర్నాన నాగేశ్వరరావు, తెల్లి హరికృష్ణ, గువ్వాడ క్రాంతి కుమార్, ప్రకాష్ పాణిగ్రాహి, బర్ల హరికృష్ణ, తట్ట రామస్వామి ఉన్నారు.



## మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి శివాజీ పరామర్శ



**మందస, డిసెంబర్ 30(వార్త):** మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ మందసలో ఇటీవల మరణించిన కుటుంబాలను పరామర్శించారు. మందస మండల సర్వేయర్ బొడ్డపాటి బాబురావు మాతృమూర్తి సీతమ్మ మరణించగా.. వారి కుటుంబాన్ని ఓదార్చారు. సీతమ్మ మరణం లోటని, ఆమె ఆత్మకు శాంతి కలగాలన్నారు. బొడ్డపాటి రామ్మోహనరావు, బాబురావులను సానుభూతి తెలిపారు. ఇటీవల మరణించిన సచివాలయ జూనియర్ లైన్‌మన్ కొంకి జోగారావు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన తల్లిదండ్రులు మల్లేశ్వరరావు, సావిత్రి చూపిన దాతృత్వం కొందరి జీవితాల్లో వెలుగులు నింపాయని, ఎందరికో ఆదర్శంగా మారిందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, సీనియర్ నాయకులు కొర్ల కన్నారావు, గువ్వాడ లక్ష్మీనారాయణ, ప్రకాశ్పపాణిగ్రాహి, మాజీ సర్పంచ్ కుంకురు తిరుపతిరావు, రాజాన మహేశ్, గార కృష్ణారావు, పార్టీ నాయకులు కొర్నాన నాగేశ్వరరావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి




**మందస, డిసెంబర్ 30(వార్త):** సౌండింగ్, లైటింగ్ నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని వినాయక సౌండి మరియు లైటింగ్ ఓనర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. 14వ వార్షికోత్సవం మందసలో జరిగింది. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ సౌండ్ అండ్ లైటింగ్ వారు ప్రోగ్రాం చేసేటప్పుడు ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, కష్టానికి తగిన ఫలితం ఉండడం లేదన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేసిన దాన్ని విజయవంతం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నామని, అలాగే రాజకీయ నాయకులు మీటింగులు, వివాహ కార్యక్రమాలు, పుట్టినరోజు వేడుకలు ఇలా.. ఏ కార్యక్రమమైనా విజయవంతం చేయడంలో సౌండింగ్, లైటింగ్ నిర్వాహకులు ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారన్నారు. సమాజం పట్ల బాధ్యతగా ఎన్నో సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈరోజు కూడా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని, రక్తం శిబిరంలో ఎంతోమంది సభ్యులు రక్తదానం చేశారన్నారు. ప్రభుత్వం తాము ఎదుర్కొంటున్న కష్టాలను గుర్తించి, ఆదుకోవాలని కోరారు. శ్రీపవనపుత్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, సౌండింగ్, లైటంగ్ కి సంబంధించిన ఎగ్జిబిషన్ నిర్వహిండం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర యూనియన్ ప్రెసిడెంట్ దువ్వు కాళీ ప్రసాద్, మందస మండల అధ్యక్షుడు గౌరకల సోమేశ్వరరావు మాట్లాడుతు ఈ కార్యక్రమం విజయవంతం చెయ్యడానికి మందస మండలం యూనియన్ సభ్యులు అందరుకూడా గత నెల రోజులుగా కష్టపడ్డారని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఐదు మండలాల గౌరవ అధ్యక్షుడు సంగారు గోవిందరావు, అధ్యక్షుడు జక్కం రమేష్, వైస్ ప్రెసిడెంట్ ఆనంద్, సెక్రటరీ అభిమన్యుసాహు, సంయుక్త కార్యదర్శి రట్టి వైకుంఠరావు, ట్రెజరర్ గేదెల అప్పన్న, ఇచ్చాపురం మండలం అధ్యక్షులు దానయ్య, సోంపేట మండలం అధ్యక్షుడు జక్కం రమేష్, కవిటి మండలం అధ్యక్షుడు బాలకృష్ణ, కంచిలి మండల అధ్యక్షుడు రామారావు, పలాస మండలం అధ్యక్షుడు ధనరాజు, వజ్రపుకొత్తూరు మండలం అధ్యక్షుడు రాజారావు, టెక్కలి మండలం అధ్యక్షుడు సుదర్శన్, నరసన్నపేట మండల అధ్యక్షుడు అప్పలనాయుడు, శ్రీకాకుళంటౌన్ అధ్యక్షుడు గోపి, ఉత్తరాంధ్ర జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

# బాధితులను ఆదుకుంటాం

- రజాక్ దాతృత్వం అభినందనీయం
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- ఫాతిమా బేగం కుటుంబానికి

**రూ. 10,000 అందజేత**

**శ్రీకాకుళం, డిసెంబరు 30(వార్త):** అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఫాతిమా బేగం కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రజాక్ కుటుంబ సభ్యులు అందజేసిన పదివేల రూపాయలు నగదును శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్ కార్యాలయంలో సోమవారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపికి రజాక్ లాంటి కార్యకర్తలు ఉండడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు కష్టం వస్తే పార్టీ తరపున సాయం చేసేందుకు ముందుకు వచ్చిన రజక్ ను ప్రశంసించారు. పార్టీ పట్ల అంకిత భావం, చిత్తశుద్ధితో పనిచేసే వారికి ఉన్నత పదవులు లభిస్తాయని తెలిపారు. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డు మీద పడిన ఫాతిమా కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజాక్ కుటుంబ సభ్యులు ఎండి రఫీ, టిడిపి మైనార్టీ నాయకులు షేక్ నిజాముద్దీన్, బహుదూర్ భాష, మహమ్మద్ రఫీ, రెడ్డి గిరిజ శంకర్, ఎండు చిన్నారావు పంచిరెడ్డి అప్పలనాయుడు, ముద్దాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నూతన సంవత్సర వేడుకల్లో బొకేలు, దుశ్శాలువలు తీసుకురావద్దు



**శ్రీకాకుళం, డిసెంబరు 30(వార్త):** నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే అభిమానులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పూల బొకేలు, గజమాలలు, పూల దండలు, దుశ్శాలువలు తీసుకురావద్దని శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. నిండు మనస్సుతో అభిమానంతో శుభాకాంక్షలు చాలని ఆయన పేర్కొన్నారు. న్యూ ఇయర్ వేడుకలు జిల్లా పార్టీ ఆఫీస్ 80 ఫీట్ రోడ్ నందు జరుపుకుంటున్నానని తెలిపారు. బొకేలు, పూల మాలలు, దుశ్శాలువలు తీసుకురావాలనుకునేవారు వారు అదే ఖర్చుతో "పేద విద్యార్థులకు" ఉపయోగపడే పుస్తకాలు, పెన్నులు అందించాలని ఆయన సూచించారు.



## మొబైల్ కంట్రోల్ హ్యూమన్ గ్రాస్ కట్టర్ ..

**వంగర, డిసెంబర్ 30(వార్త):** వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి సైన్స్‌ఫేర్ కార్యక్రమం జరిగింది. రెసిడెన్షియల్ లాండ్స్ కమర్షియల్ ల్యాండ్ స్కేప్స్ గోల్డ్ కోర్స్ పబ్లిక్ బాక్స్ స్కూల్స్ ఫీల్డ్ క్రాప్స్ ప్లేగ్రౌండ్స్ వంటి ప్రాంతాల్లో కాలుష్య రహిత గ్రాస్ కట్టర్ ను మడ్డువలస డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థులు కె.అను, తొమ్మిదవ తరగతి, కె.అశ్విని ఎనిమిదవ తరగతి సైన్స్ టీచర్స్ బి.లక్ష్మీప్రసన్న, సిహెచ్ రమణమ్మ, పర్యవేక్షణలో తయారు చేశారు. తక్కువ ఖర్చుతో సులువుగా ల్యాండ్ సేఫ్టీతో లేబర్ కాస్ట్ తక్కువతో దీన్నే ఉపయోగించవచ్చు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి – 2. వై దుర్గారావు, వంగర హైస్కూల్ ఇన్చార్జ్ హెచ్ఎం, రాష్ట్ర అవార్డు గ్రహీత సూర జయకృష్ణ, మండలంలో గల పలు హైస్కూల్, యూపీ స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు, సీఆర్ఎంటి ఎం. గణపతి, ఎస్ శ్రీను, ప్రేమ్ కుమార్, ఎం ఆర్ సి. ఎం ఐ ఎస్ డి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 30(వార్త):** విద్యార్థుల వ్యక్తిగత ఎగ్జిబిట్ , విద్యార్థుల గ్రూప్ ఎగ్జిబిట్,టీచర్ ఎగ్జిబిట్ ల లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో సైన్సు ఎగ్జిబిషన్ నిర్వహించారు. ప్రాధమికోన్నత మరియు ఉన్నత పాటశాలలు కు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జే సాధయ్య , మరియు ఇరువురు ఎంఈఓ లు కే.అప్పారావు మరియు, ఎస్ విశ్వనాథం , జిహెచ్ఎస్ ఇచ్చాపురం ప్రధానోపాధ్యాయులు ఎన్ విశ్వనాథం లు ఘనంగా ప్రారంభించారు. ఈ పోటీలలో వ్యక్తిగతంగా 22 మంది, మరియు గ్రూపుగా 27 ప్రాజెక్టులు పాల్గొన్నాయి. వీటితోపాటు టీచర్ వి భాగం నుంచి కూడా పాల్గొన్నారు. ఇందులో వ్యక్తిగత విభాగం నుంచి ఏపీ మోడల్ స్కూల్ పురుషోత్తపురం విద్యార్థి పి.దీపక్ కుమార్ విజేతగా గెలుపొందడమైనది. ( ప్రాజెక్ట్ పేరు : లిక్విడ్–3) గ్రూపు విభాగం నుంచి జడ్పీహెచ్ఎస్ కొలిగాం విద్యార్థులు ఆదిత్య మహారాణా, యశస్విని మహంతినీ . ( ప్రాజెక్ట్ పేరు : స్లయిడింగ్ బ్రిడ్జి)విజేతలుగా అలాగే ఉపాధ్యాయ విభాగం నుంచి జడ్పీహెచ్ఎస్ లొద్దపుట్టి ఉపాధ్యాయిని ఎస్ వాహిని (ప్రాజెక్ట్ పేరు : ఆటోమేటిక్ జిబ్రా క్రాసింగ్ సిస్టం) విజేతగా నిలిచారు. వీరు జనవరి మూడో తేదీన నిర్వహించబోయే జిల్లా స్థాయి పోటీలకు ఇచ్ఛాపురం మండలం నుంచి పాల్గొంటున్నారు. విజేతలను ఇరువురి ఎంఈఓలు అభినందించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జే సాధయ్య , అధ్యాపకులు బి సురేష్ , పి సురేష్ , టి వైకుంఠ రావు , ఎం ప్రసాద్ రావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, సిఆర్ఎంటిలు పాల్గొన్నారు.

# విద్యార్థులు శాస్త్రవేత్తలయ్యేందుకు సైన్స్ ఫేర్ దోహదం



**వంగర, డిసెంబర్ 30(వార్త):** సృజనాత్మకతతో సౌర వ్యవస్థ తయారుచేసి గ్రహాల నమూనాను వంగర హైస్కూల్ విద్యార్థులు తయారు చేశా రు.సోమవారం హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయులు డి. సత్తిబాబు పర్యవేక్షణలో ఎనిమిదవ తరగతి చదువుతున్నజి ఈ.అఖిల, నైంత్ క్లాస్ చదువుతున్న ఎం. లిఖిత లు ఈ నమూనాను తయారు చేశారు.ఈ నమూనాతో గ్రహాల యొక్క చలనాన్ని భూ భ్రమణాన్ని భూ పరిభ్రమరాన్ని ఎంతో చక్కగా వారు వివరించారు. ఈ నమూనా ఉపయోగించి సూర్యునికి దగ్గరగా ఉన్న గ్రహాలు, సూర్యునికి దూరంగా ఉన్న గ్రహాల గురించి వివరించారు. అదేవిధంగా మనకున్న గ్రహాల్లో ఏది చిన్న గ్రహం, ఏ గ్రహం పెద్ద గ్రహం అన్న వివరాలను విద్యార్థులు వివరించారు. ఈకార్యక్రమంలో వంగర హైస్కూల్ ఇన్చార్జ్ హెచ్ఎం. రాష్ట్ర అవార్డు గ్రహీత ఎస్.జయ కృష్ణ,పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.



**పలాస, డిసెంబర్30 (వార్త):** విద్యార్థుల శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడేది సైన్స్ ఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన మేధాశక్తి బయటపడుతుందని పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహమూర్తి, ఎంఇఓలు సిహెచ్ శ్రీనివాసరావు, సత్యంలు అన్నారు. సౌత్ ఇండియా ఫెస్టివల్లో భాగంగా పలాస ప్రభుత్వ హై స్కూల్‌లో మండల స్థాయి పాఠశాలల సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్ కు వ్యక్తిగత ప్రోజెక్టులు 17, గ్రూప్ ప్రోజెక్టులు, రెండు, ఉపాధ్యాయ ప్రోజెక్టులు రెండు ప్రదర్శించారు. ఈ ప్రోజెక్టులలో వ్యక్తిగత విభాగంలో పలాస హైస్కూల్ 9వ తరగతి చదువుతున్న విద్యార్థి జస్వంత్ పాత్రో విజేతగా నిలవగా, గ్రూపు విభాగంలో చిన్నబాడాం హైస్కూల్కు చెందిన పదవ తరగతి విద్యార్థులు టి.భరత్ కుమార్, బి.ప్రవల్లిక, ఎం.అక్షిత విజేతలుగా నిలవగా, ఉపాధ్యాయుల విభాగంలో కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎల్.నీలాచలం ప్రదర్శించిన ప్రోజెక్టును విజేతగా ఎంపిక చేశారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు జనవరి 3వ తేదిన జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారు. ఈ ప్రదర్శనలకు న్యాయనిర్ణేతలుగా పలాస జూనియర్ కళాశాల అధ్యాపకులు హనుమంతు బిజ్జి, యుగందర్, సహస్త్రులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పలాస హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.దశరధి, వివిద పాఠశాలల నుంచి వచ్చిన ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించండి

**వంగర, డిసెంబర్30 (వార్త):** ఎవరి భూమి వారి పేరున నమోదుయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని మగ్గూరు గ్రామవాసులు తహసీల్దార్ ధర్మరాజును కోరారు. సోమవారం ఆ గ్రామంలో జరిగిన రెవెన్యూసదస్సులో గ్రామ పెద్దలు, రైతులందరూ ఈ విషయమై ఆయనకు వినతిని అందజేశారు. కొంతమంది రైతుల భూమిని ప్రాజెక్టులో ముంపుగా చూపిస్తుందని, 22 ఏళ్ల క్రితం మరణించిన వారి పేరుతో భూమి ఉన్నట్లు చూపిస్తుందని, నిజమైన రైతుకు ఉన్న భూమి పూర్తిగా చూపించడం లేదన్నారు. గంట అప్పన్న మ్మకు 2.50 ఎకరాల భూమి ఉండగా, ఆన్‌లైన్లో 65సెంట్లు చూపిస్తుందని, చాలామంది రైతులకున్న భూమి కుటుంబ పెద్ద పేరున ఎంత పొలం ఉందో, ఆయన కుటుంబసభ్యుల పేరున లేని భూమిని చూపిస్తుందని వివరించారు. మా బౌండరీలో సుమారుగా 80 ఎకరాల వరకూ పంట భూమి ఉందని, మిగతా భూమి మడ్డువలస ప్రాజెక్టులో ముంపునకు గురైందని రైతులు వివరించారు. దీనికి స్పందించిన తహసీల్దార్ సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, వీఆర్వో సింహాచలం, సచివాలయ సర్వేయర్, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# అమిత్‌షాని కేబినెట్ నుంచి తొలగించాలి




**పలాస, డిసెంబర్30 (వార్త):** వామపక్ష పార్టీల డిమాండ్ భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ పార్లమెంట్ వేదికగా కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండించాలని పలాస వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘల నాయకులు మాట్లాడుతూ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామడ సన్యాసిరావు, సిపిఐ కార్యదర్శి చాపర వేణుగోపాల్, సిపిఎం నాయకులు ఎన్.గణపతి, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు జుత్తు వీరాస్వామి మాట్లాడుతూ పార్లమెంట్ వేదిక అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని కేంద్ర మంత్రి పదవి నుండి అమిత్ షా నీ భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మూడోసారి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగాన్ని మార్చాలని, మనుస్మృతిని తీసుకురావాలని లౌకిక ప్రజాస్వామ్యక విలువల్ని కూలదోసి ఈ దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలని కుట్ర చేస్తుందని అన్నారు. తక్షణమే అమిత్ షా రాజీనామా చేయకుంటే, మోడీ ప్రభుత్వం అమిత్ షా పై చర్యలు తీసుకోకుంటే దేశవ్యాప్తంగా వామపక్షాలు ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడియస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రవి, పి వై ఎల్ జిల్లా కన్వీనర్, సారా జగన్ రైతు కూలీ సంఘం నాయకులు మధ్యలో రామారావు, పోతనపల్లి కామేశ్వరరావు, వంకల పాపయ్య, మామిడి భీమారావు, జడ్డే అప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నివగాం ఆర్టీసి కాంప్లెక్స్ లీజు రద్దు చేసేవరకు పోరాటం

**కొత్తూరు, డిసెంబర్30 (వార్త):** నివగాం ఆర్టీసీ కాంప్లెక్స్ లీజు రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామని ఏపీ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ అన్నారు. 1995లో నిర్మించిన ఈ కాంప్లెక్స్‌ను ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇవ్వడం అన్యాయమన్నారు. తక్షణం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలవెల్లి రాంబాబు, పూర్ణచంద్ర పట్నాయక్. బి.చిన్నారావు. బూరాడ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



# న్యాయవాదుల నిరసన

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 30 (వార్త):** శ్రీకాకుళం జిల్లా కోర్టు మెయిన్ గేట్ ముందు రోడ్డుపై శ్రీకాకుళం జిల్లా పట్టణ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి ఈశ్వరరావు, జనరల్ సెక్రటరీ ఎగళ్ల ప్రసన్న కుమార్ మాట్లాడుతూ అనంతరం జిల్లాలో సీనియర్ న్యాయవాది వీవీ శేషాద్రి మృతికి పోలీసులే కారణమన్నారు. సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు నిర్వహించిన ర్యాలీలో న్యాయవాదులు కంచరాన నాగభూషణరావు, ఎన్ని సూర్యారావు, నౌపడ విజయ్ కుమార్, కొంక్యాన సుభాష్, బగాది రామ్మోహనరావు, పుప్పాల రంగబాబు, ఖస్పా ప్రతాప్‌చంద్ర, ఆరికితోట కృష్ణరాజు, ఆగూరు ఉమామహేశ్వరరావు, మద్దుల మూర్తి, గేదెల ఇందిరాప్రసాదరావు, పిట్టా దామోదరరావు, ధవల విజయలక్ష్మి, కొప్పిశెట్టి ఉషారాణి, పైడి అన్నపూర్ణ, గుండ బాలమోహన్, చీపురు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.






## సచివాలయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 30 (వార్త):** గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం డెమొక్రటిక్ అసోసి యేషన్ (69/21) 2025వ సంవత్సరం వార్షిక క్యాలెం డర్‌ను కేంద్ర మంత్రి శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజ రాపు రామ్మోహన్ నాయుడు తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల పనితీరు చాలా మెరుగుపడిందని ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయటంలో వీరి పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రవి సాహు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ రోహిత్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

## కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలలో అవంతిక బృందం

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 30 (వార్త):** శ్రీకాకుళం జిల్లాకు మంచి కీర్తిప్రతిష్టలు తీసుకు వస్తామని నృత్య శిక్షకురాలు జక్కువ అవంతిక అన్నారు. శుక్రవారం నుండి జరుగుతున్న కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలు సోమవారం ముగిసింది. కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో వైభవంగా ప్రారంభమైన అంతర్జాతీయ నాట్య సమ్మేళనం ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఏభై అడుగుల హస్తముద్రికల స్తూపాన్ని నిలిపి, కూచిపూడి నాట్య జెండాను ఆవిష్కరించారు. ఉత్సవాలలో భాగంగా శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట మండలం, పోలాకి గ్రామానికి చెందిన, (అవంతిక బృందం) శ్రీ సాయి నటరాజ నృత్యానికేతన్ విద్యార్థిని లు పాల్గొని తమ నృత్యాలతో అలరించారు. నటరాజ నృత్యానికేతన్ గురువు అవంతికా మాట్లాడుతూ కూచిపూడిలో మా చిన్నారులు పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. కళలకు శ్రీకాకుళం పుట్టినిల్లని, ఎంతో మంది నృత్య కళాకారులు ఉన్నారన్నారు.



## బాక్సింగ్ క్రీడతో.. మానసిక దృఢత్వం



**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 30 (వార్త):** బాక్సింగ్ డే సందర్భంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ బాక్సింగ్ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావును నడక సంఘాల నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, శాసపు జోగినాయుడు, గుడ్ల జగ్గారావులు మాట్లాడుతూ బాక్సింగ్ క్రీడకు శ్రీకాకుళం జిల్లాలో ఒక గుర్తింపు గౌరవం తెచ్చిన మహోన్నత వ్యక్తి మానిక్యాల ఉమామహేశ్వరరావు అని తెలిపారు. ఎందరో విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారని చెప్పారు. బాక్సింగ్ తరతరాల క్రీడ అని, శారీరక, మానసిక దృఢతాన్ని మెరుగుపరుస్తుందని చెప్పారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా పిఠాపురంలో ఈ నెల 18,19,20 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగిన సీనియర్ మెన్ బాక్సింగ్ టోర్నమెంట్ విజేతలకు అభినందించారు.

## ఎస్సీ, ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

**శ్రీకాకుళం, డిసెంబర్ 30(వార్త):** కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో ఎచ్చెర్ల నియోజకవర్గంలో డా. బి.ఆర్.అంబేద్కర్ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రం పేరిట ఒక నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలోని ఎస్సీ ఎస్టీ నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను పెంపొందించడం లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమ వారం పౌర హక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టంపై జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్ర నిర్మాణం కోసం న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు లేఖ రాశామన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను సభ్యులు పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అట్రాసిటీ కేసుల పరిష్కారం ఆలస్యం కాకూడదని, నూతనంగా ఎన్నికైన సభ్యులకు శిక్షణ కార్యక్రమాల్ని నిర్వహించాలని సూచించారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ఎస్టీ మాకివలసలో భూములు లేని ఎస్టీ రైతులకు భూములు అందించి ఆదుకోవాలని కోరారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎస్సీల భూ ఆక్రమణలపై విచారణ జరపాలని, దాడులు, భూ కబ్జాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర రావు, శ్రీకాకుళం డీఎస్పీ సిహెచ్.వివేకానంద, సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వ మోహన్ రెడ్డి, కమిటీ సభ్యులు గేదెల రమణ మూర్తి, కోట రాములు, తాలాబత్తుల ధనుంజయరావు, వివిఎస్ఎన్ రాజు, దాసరి తిరుమలరావు, బాలరాజు, దండాశి రాంబాబు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మాన్యువల్ స్కావెంజర్ వ్యవస్థకు స్వస్తి పలకాలి

మాన్యువల్ స్కావెంజర్స్ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, ఆ వ్యవస్థకు స్వస్తి పలకాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాల యంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాన్యువల్ స్కావెంజర్స్ వ్యవస్థ నిర్మూలనపై మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, సంబంధిత అధికారులతో జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో మాన్యువల్ స్కావెంజర్స్ గా ఉండేవారిని వెంటనే గుర్తించాలని, వారి సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీలలో సఫాయి కర్మచారులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిబంధనల ప్రకారం వారికి మాస్క్, గ్లౌజులు, షూలు, ఆయిల్, సోప్, హెల్మెట్, సేఫ్టీ ప్యాక్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, తదితర రకాల భద్రతా పరికరాలు, ఇతర సదు పాయాలు కల్పించాలన్నారు.

## మహిళపై ఇద్దరు దాడి

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 30 (వార్త):** మద్యం మత్తులో ఇద్దరు యువకులు ఓ మహిళపై దాడి చేసిన ఘటన శ్రీకాకుళం నగరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్ సందులోని ఓ కల్యాణ మండపంలో శుభకార్యానికి లావేరు మండలం మురపాక గ్రామానికి చెందిన లింగాల అప్పమ్మ తన చెల్లెలి కుమారుడితో ఆదివారం ద్విచక్ర వాహనంపై వచ్చింది. అదే సమయంలో నగరానికి చెందిన ఎండి సల్మాన్, ఎర్రయ్య ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తున్నారు. వారిద్దరూ మద్యం మత్తులో కిందపడిపోయారు. తాము పడిపోవడానికి అప్పమ్మ, ఆమె చెల్లెలు కొడుకే కారణమని వారిద్దరిని కొట్టారు. దీంతో అప్పమ్మకు కుడి కంటి కింది భాగంలో తీవ్ర గాయమైంది. ఆమెను స్థానికులు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అప్పమ్మ అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సోమవారం దాడికి పాల్పడిన సల్మాన్, ఎర్రయ్యలపై వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ కేసు నమోదు చేశారు.

## పుట్టినరోజు వేడుకల్లో వివాదం

**కొత్తూరు, డిసెంబర్ 30 (వార్త):** కొత్తూరు మండలంలో ఆదివారం ఓ పుట్టిన రోజు వేడుకల్లో వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో మరలా సోమ వారం వాగ్వాదం జరిగి ఒక యువకుడు దాడికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పారాపురం గ్రామానికి చెందిన పైల శ్రీను పుట్టిన రోజు వేడుక సమయంలో కేక్ కట్ చేస్తుండగా జీవన్‌కుమార్ ఫోం స్ప్రే కొట్టాడు. దీంతో దుక్క సాయి కుమార్ అతడిని వారించగా వివాదం జరిగి సద్దుమణిగింది. సోమవారం మధ్యాహ్నం పారాపురం సచివాలయం వద్ద మళ్లీ వాగ్వాదం జరగ్గా జంప జీవన్ కుమార్ సాయికుమార్‌పై దాడిచేశాడు. ఈ నేపథ్యంలో గాయపడిన సాయి కుమార్ కొత్తూరు సామాజిక ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**కంచిలి, డిసెంబర్ 30 (వార్త):** కంచిలి మండలంలోని బాసు బంజిరి గ్రామానికి చెందిన బొండాడ రామారావు(45) తాను పెంచుతున్న మేకల ఆహారం కోసం సోంపేట మండలంలోని బిరువాడ సమీపంలో హైవే వద్ద ఉన్న పొలంలోకి సోమవారం వెళ్లాడు. అక్కడ కొందరు పందుల బెడద నుంచి తప్పించుకొనేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. బారువ ఎస్ఐ హరిబాబు కేసు నమోదుచేశారు.

## మనస్తాపంతో హెల్త్ అసిస్టెంట్ మృతి

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 30 (వార్త):** వెంకటాపురం పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పూజారి సూర్యప్రసాదరావు(57) ఉద్యోగం పోయిందని మనస్తాపానికి గురై సోమవారం మృతి చెందారు. హెల్త్ అసిస్టెంట్ల యూనియన్ నాయకుడు మురళి కథనం మేరకు.. హెల్త్ అసిస్టెంట్‌గా సూర్యప్రసాద రావు 22 ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగం పర్మినెంట్ కాకపోయినా, ప్రతి నెలా వచ్చే కొద్దిపాటి జీతంతోనే తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 1200 మంది హెల్త్ అసిస్టెంట్లను ఉద్యోగంలో నుంచి తొలగించగా సూర్యప్రసాదరావు కూడా ఉద్యోగం కోల్పోయాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఇన్నేళ్ల సర్వీసు తర్వాత ఉద్యోగంలో నుంచి తీసేస్తే తన కుటుంబాన్ని ఎలా పోషిస్తాను అనే మనోవ్యథతో బాధపడుతూ బ్రెయిన్ హెమరేజ్‌కు గురయ్యాడు. సోమవారం ఓ ఆసుపత్రిలో చేర్పించగా ఆయన మృతిచెందాడు. కాగా సూర్య ప్రసాదరావు కుటుంబాన్ని ఆదుకోవాలని యూనియన్ నాయకులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు.

## వీఆర్వో కామేశ్వరరావుపై ఫిర్యాదు

**సంతబొమ్మాళి, డిసెంబర్ 30 (వార్త):** అక్రమాలకు పాల్పడుతూ రికార్డులు తారుమారు చేస్తున్న ప్రస్తుత మర్రిపాడు సచివాలయ వీఆర్వో కామేశ్వరరావు పై చర్యలు తీసుకోవాలని వడ్డితాండ్ర పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన సాహుకారి జోగారావు 'మీ కోసం'లో సోమవారం టెక్కలి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. వడ్డితాండ్ర రెవిన్యూ పరిధిలో సర్వే నెంబర్ 6/7సిలో జోగారావుకు 13 సెంట్లు భూమి ఉండగా తొమ్మిది సెంట్లు మింగేసి నాలుగు సెంట్లు మాత్రమే చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ విషయంపై గతంలో పరుమారులు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయిందన్నారు. ఈసారి కైనా "మీకోసం" ద్వారా ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 1-బి అడంగల్ ఇవ్వవలసిందని తహసీల్దారు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ వీఆర్వో కామేశ్వరరావు ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్ చేస్తూ సమస్య పరిష్కరించలేదని ఫిర్యాదు ద్వారా జోగారావు తెలిపారు. అంతేకాకుండా గతంలో ఇస్తున్న ఫిర్యాదులు గడువు తేదీ ముగిసే సరికి కుటుంబ తగాదాలు అంటూ తప్పుడు నివేదికలు పంపిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదమ్ముల మధ్య తగాదాలు సృష్టించి, దొంగ రిజిస్ట్రేషన్లకు వీఆర్వో కామేశ్వరరావు సహకరిస్తున్నారని, ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా పాస్ బుక్ , అడంగల్ ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైనా వీఆర్వో కామేశ్వరరావు పై చర్యలు తీసుకొని 1- బి, అడంగల్, పాస్ బుక్ మంజూరు చేసి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఏబీవీపీ నగర మహిళ కమిటీ

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 30 (వార్త):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శ్రీకాకుళం నగర కమిటీని ఏర్పా టు చేశామని జిల్లా కన్వీనర్ బోర గోపి తెలిపారు. జిల్లా కో కన్వీనర్‌గా గాయత్రి, సెక్రెటరీగా పల్లవి, టెక్నికల్ కన్వీనర్‌గా జోత్స్న, హాస్టల్ కన్వీనర్‌గా అనిత, ఎస్ఎఫ్‌డీ కన్వీ నర్‌గా స్వాతి, ఖేల్ కన్వీనర్‌గా పూజితలను ఎన్నుకున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546